

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించి తిప్పాపూర్‌లోని గోశాలలో కోడె కళేబరం

## రాజన్న గోశాలలో మరో రెండు కోడెల మృత్యువాత

వేములవాడ టౌన్,జూన్ 6 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించి తిప్పాపూర్ గోశాలలో శుక్రవారం అనారోగ్యంతో మరో రెండు కోడెలు మృతిచెందినట్టు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గోశాలలో ఉన్న 1300 కోడెలలో ప్రస్తుతం 11 కోడెలకు వెటర్నరీ వైద్యులు చికిత్స అందిస్తున్నారని తెలిపారు. మరో 3 కోడెల ఆరోగ్యం క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నదని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లపై తన్నుకున్న కాంగ్రెస్ నేతలు

- నచ్చినోళ్లకు ఇండ్లు ఇచ్చుకున్నరని పరస్పరం దాడులు
- మంచిర్యాల జిల్లా నెన్నెల భూభారతి సదస్సులో రచ్చ

నెన్నెల, జూన్ 6: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికల అక్రమాలు జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలతో అవకతవకలు రచ్చకెక్కుతున్నాయి. కాంగ్రెస్ నేతలు తమకు నచ్చినవాళ్లకే ఇండ్లు ఇచ్చుకుంటున్నారన్న ప్రతిపక్షాలు, దరఖాస్తుదారుల ఆరోపణలకు అధికార పార్టీ నేతల మధ్య విభేదాలు ఇందుకు బలం చేకూర్చుతున్నాయచి చర్చ నడుస్తున్నది. తాజాగా మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జండావెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక వ్యవహారంపై రచ్చ జరిగింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొగు సుధాకర్ భూసమస్య గురించి చెప్పుకునేందుకు తన తండ్రితో కలిసి వచ్చాడు. అదే సమయంలో కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ జనగాం తిరుపతి, అతని అనుచరులు అక్కడికి చేరుకున్నారు. ఇరువురి మధ్య ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ వ్యవహారం చర్చకు వచ్చింది. భూములు, ఇండ్లు ఉన్నవారికే ఇండ్లు ఇస్తున్నారని, లేనోళ్లకు ఎందుకు ఇవ్వడంలేదని అక్కడున్న నాయకులను సుధాకర్ ప్రశ్నించాడు. దీంతో తిరుపతి, సుధాకర్ మధ్య మాటామాటా పెరిగింది. ఒకరినొకరు తోసుకొని పిడిగుద్దులతో ఘర్షణకు దిగారు. ఈ దాడిలో సుధాకర్‌కు గాయాలు కాగా, బెల్లంపల్లి హాస్పిటల్‌కు తరలించారు. తిరుపతి, అనుచరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని సుధాకర్ తెలిపారు.



మంచిర్యాల జిల్లా నెన్నెలలో తిరుపతి, అనుచరుల దాడిలో గాయపడిన సుధాకర్

# క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవాలి

- సినీ సంగీత దర్శకుడు కీరవాణి
- ఘనంగా ఎస్ఆర్ స్నాతకోత్సవం

హసన్‌పర్తి, జూన్ 6 : విద్యార్థులు అంకిత భావంతో, క్రమశిక్షణతో మెదిలితే లక్ష్యాన్ని చేరుకుంటారని సినీ సంగీత దర్శకుడు, పద్మశ్రీ ఎంఎం కీరవాణి పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా అనంతసాగర్ శివారు ఎస్ఆర్ యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా ఏపీ ప్రభుత్వ ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ సలహాదారు, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, సినీ సంగీత దర్శకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కీరవాణి హాజరయ్యారు. తెలుగు సినీపరిశ్రమకు కీరవాణి చేసిన సేవలను గుర్తించి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కీరవాణి మాట్లాడుతూ.. ఎస్ఆర్ చాన్స్‌లర్ వరదారెడ్డి తనకు డాక్టరేట్‌ను ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. స్నాతకోత్సవంలో ఎస్ఆర్ యూనివర్సిటీ గత మూడేళ్లలో నేషనల్ ర్యాంకింగ్‌లో టాప్ 100లో ఉండడం విశేషమన్నారు. వరదారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకుసాగాలన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, డిగ్రీలు ప్రదానం చేశారు.



కీరవాణికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఎస్ఆర్‌యూ చాన్స్‌లర్ వరదారెడ్డి

# భూభారతి సదస్సులో రైతుల ఘర్షణ

- అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందిపైనా దాడి

బెల్లంపల్లి, జూన్ 6: ప్రభుత్వం సరైన ప్రణాళిక, ముందస్తు చర్యలు తీసుకోకుండా నిర్వహిస్తున్న భూభారతి సదస్సులు రణరంగంగా మారుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా మరోఘటన చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన తహసీల్దార్ కృష్ణ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో భూభారతి సదస్సు నిర్వహించారు. ఉదయం నుంచి సదస్సు సాఫీగా సాగింది. భోజన విరామం తర్వాత గ్రామానికి చెందిన పూదరి రమేశ్ తన నాలుగు ఎకరాలకు విరాసత్ చేయించాలని అధికారులకు దరఖాస్తు అందించాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన మైళ్ల రాజ్‌కుమార్ అక్కడికి చేరుకుని, తాను సాగు చేసుకుంటున్న భూమికి విరాసత్ దరఖాస్తు ఎలా చేసుకుంటావని రమేశ్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి, పరస్పరం చేయి చేసుకున్నారు. అంతటితో ఆగకుండా కార్యాలయంలో ఉన్న వంట సామగ్రి, ఇతర వస్తువులతో దాడి చేసుకున్నారు. స్థానికులు, రెవెన్యూ సిబ్బంది వారిని అడ్డుకున్నా వినిపించుకోకుండా పిడిగుద్దులు గుద్దుకున్నారు. వారించేందుకు ప్రయత్నించిన రెవెన్యూ సిబ్బందిపైనా దాడికి పాల్పడ్డారు. చివరికి తాళ్లగురిజాల ఎస్ఐ చుంచు రమేశ్ వచ్చి ఇరువురిని అడ్డుకున్నారు. ఈ ఘటనపై తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో రమేశ్, డీసీపీ కార్యాలయంలో రాజ్‌కుమార్ పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చంద్రవెల్లిలో భూభారతి సదస్సులో పరస్పరం దాడి చేసుకుంటున్న రైతులు



నిర్మల్ జిల్లా కుభీర్ మండలం అంతర్నిలో కూలిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం

# పాఠశాల భవనం కూలి నలుగురు విద్యార్థులకు గాయాలు

- బడిబాట ప్రారంభం రోజే ఘటన
- శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించాలని
- నాలుగు నెలల క్రితమే వినతి
- అయినా పట్టించుకోని అధికారులు

కుభీర్, జూన్ 6 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలం అంతర్ని గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం కూలడంతో నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. బడిబాట ప్రారంభంరోజే ప్రమాదం జరగడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం ప్రారంభమవడంతో ఉదయమే హెచ్ఎం సుభాష్, సహ ఉపాధ్యాయుడు కత్తి నాగోరావు పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. అనంతరం ఉపాధ్యాయులు కుభీర్‌లోని విద్యావనరుల కేంద్రానికి వెళ్లి పాఠ్యపుస్తకాలు తీసుకొచ్చి పాఠశాలలో ఉంచి మధ్యాహ్నం వెళ్లిపోయారు. కొందరు విద్యార్థులు పాఠశాల భవనం వద్ద ఆడుకుంటున్నారు. అదే సమయంలో శిథిలావస్థలో ఉన్న భవనం ఒక్కసారిగా కూలిపోయింది. ఇటుకలు పడటంతో విద్యార్థులు జీ ప్రేమ్‌కు తలకు తీవ్ర గాయమవగా, సాయికుమార్ కాలు విరిగింది. ప్రణయ్, అభినయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో భైంసా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ సమస్యపై జనవరి 29న నమస్తే తెలంగాణ జిల్లా పేజీలో 'ఐదు తరగతులకు ఒకే గది' శీర్షికన కథనం ప్రచురితం కాగా 30 రోజుల ప్రణాళికలో భాగంగా జనవరి 30న జరిగిన పోషకుల సమావేశంలో శిథిలమైన పాఠశాల భవనాన్ని కూల్చివేయాలని తీర్మానం చేసి డీఈవోకు పంపించారు. అయినప్పటికీ భవనం కూల్చివేతకు చర్యలు తీసుకోకపోవడంతో ఈ ఘటన జరిగిందని, అధికారులు నిర్లక్ష్యం వహించారని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

# మావోయిస్టు కీలక నేత భాస్కర్ ఎన్‌కౌంటర్

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఘటన
- మృతుడు టీజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు
- ఆయనపై 45 లక్షల రివార్డు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 6: మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ సీనియర్ నాయకుడు సుధాకర్ మరణించిన 24 గంటల వ్యవధిలోనే మరో కీలక నేత ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, కుమ్రంభీం-మంచిర్యాల డివిజన్ కమిటీ సభ్యుడు మైలారపు ఆడెళ్లు అలియాస్ భాస్కర్ ప్రాణాలు కోల్పోయారు. బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు డీఆర్‌జీ భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరపడంతో వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య పలుమార్లు ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకున్నారు. తర్వాత భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. ఘటనా స్థలం నుంచి భాస్కర్ మృతదేహంతోపాటు ఒక ఏకే-47, ఇతర ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. భాస్కర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది.

## 'మావోయిస్టులను కోర్టులో హాజరపర్చాలి'

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టు నాయకులు బండి ప్రకాశ్, దిలీప్, సీటు, రామన్న, మున్నా, సునీత, మహేశ్‌తోపాటు మిగతా మావోయిస్టులను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మెంబర్ సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ మెంబర్ మైలారపు ఆదేళ్లు అలియాస్ భాస్కర్‌తో సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు తెలిపారు. గురువారం సుధాకర్‌ను, శుక్రవారం భాస్కర్‌ను బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని తెలిపారు. మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేసే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు.

## 'ఉపాధ్యాయులను నిరాశపరిచారు'

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు ఉపాధ్యాయ లోకాన్ని నిరాశపరిచాయని టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అభిప్రాయపడ్డారు. పెండింగ్ డీఏల విషయంలో సర్కారు పునరాలోచించాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే టీచర్ల బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా నిబంధనలు మార్చాలని సూచించారు. డీఎస్సీ -2003 టీచర్లకు పాత పింఛన్‌ను వర్తింపజేయాలని, మాడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు, గురుకులాల టైంటేబుల్ మార్పు, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

## మహిళా సంఘాల సభ్యులకు ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : మహిళా సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు విద్యాశాఖ యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించింది. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి చదువులు పూర్తిచేయించనున్నది. ఇందుకు సెర్ప్, సమగ్రశిక్ష, వయోజన విద్యాశాఖలు భాగస్వామ్యం కానున్నాయి. ఈ మూడింటి సమన్వయంతో మహిళా సంఘాల సభ్యులను ఓపెన్ స్కూళ్లల్లో చేర్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోనున్నారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ప్రవేశాల షెడ్యూల్ విడుదలయ్యింది. 2025-26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ నోటిఫికేషన్‌ను ఈ నెల 12న విడుదల చేస్తారు. ఆగస్టు 12 వరకు అప్లికేషన్లు జారీచేస్తారు. నిర్ధేషిత ఫీజు చెల్లించి జూలై 11 వరకు అడ్మిషన్లు పొందవచ్చు. ఆలస్య రుసుముతో జూలై 12 నుంచి ఆగస్టు 12 వరకు అడ్మిషన్లు పొందవచ్చు.

## ఎస్ఎస్ఏ పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల కొనసాగింపు

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ పరిధిలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను తిరిగి కొనసాగిస్తూ పాఠశాల విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు హెల్పర్లు, ఆయాలు (కేర్ గివింగ్ వలంటీర్లు)ను 2025-26 విద్యా సంవత్సరంలో కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు.

## 18 నుంచి గ్రూప్-3 సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-3 పోస్టుల భర్తీలో భాగంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌ను టీజీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. ఈ నెల 18 నుంచి జూలై 8 వరకు అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ఈ షెడ్యూల్‌లో హాజరుకాలేని వారి కోసం జూలై 9న రిజర్వ్‌డేగా ప్రకటించారు. నాంపల్లిలోని తెలుగు వర్సిటీ ప్రాంగణంలో వెరిఫికేషన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. 1,388 పోస్టుల భర్తీకి గ్రూప్-3 నోటిఫికేషన్ విడుదల చేయగా, రాత పరీక్షను నిర్వహించి జీఆర్ఎల్‌ను సైతం ప్రకటించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్, వెరిఫికేషన్‌కు హాజరయ్యే వారి వివరాలను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 17 నుంచి జూలై 9 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చని కమిషన్ తెలిపింది.

### 16న గ్రూప్-1 సర్టిఫికెట్ వెరిఫికేషన్

గ్రూప్-1 పోస్టుల భర్తీలో భాగంగా మరికొందరు అభ్యర్థులకు ఈ నెల 16న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ వెల్లడించింది. ఇప్పటికే రెండు విడతల వెరిఫికేషన్ ముగియగా, మూడో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే వారి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని కమిషన్ వెల్లడించింది. హాజరుకాలేని వారి కోసం ఈ నెల 17న రిజర్వుడేగా ప్రకటించారు. వివరాల కోసం కమిషన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని నవీన్ తెలిపారు.

## రేపు, ఎల్లుండి ఐసెట్ పరీక్ష

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్ పరీక్ష ఈనెల 8, 9 తేదీల్లో (ఆదివారం, సోమవారం) రాష్ట్రవ్యాప్తంగా జరగనున్నది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎగ్జామ్ సెంటర్ల గేట్లను పరీక్షకు 15 నిమిషాల ముందే క్లోజ్ చేస్తామని ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ అలువాల రవి తెలిపారు. రెండు రోజుల్లో మూడు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 8న మొదటి సెషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 వరకు రెండో సెషన్‌లో పరీక్ష జరుగుతుందని తెలిపారు. 9న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరిగే మూడో సెషన్‌తో పరీక్షలు ముగుస్తాయని వెల్లడించారు. ఉదయం సెషన్‌లో 9:45కు, మధ్యాహ్నం సెషన్‌లో 2:15 గంటలకే సెంటర్ల గేట్లు మూసేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 జోన్లలో 96 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సారి మొత్తం 71,757 మంది ఐసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

## తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌ది ముఖ్య పాత్ర

### ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

మూసాపేట, జూన్ 6 : తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌ది ముఖ్య పాత్ర ఉన్నదని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని మూసాపేట మండల కేంద్రంలో 13సబ్‌స్టేషన్లకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా శుక్రవారం శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చేయలేదని, వాటిని కొనసాగిస్తూనే 6 గ్యారెంటీలలో కొత్త పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్‌ది ప్రముఖంగా ఉన్నారని అన్నారు. యావత్ తెలంగాణను సంఘటితం చేయడంతోపాటు, తెలంగాణ సాధన ఉద్యమంలో కేసీఆర్ పాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు. తాను కూడా తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ పార్టీలో మూడున్నరేండ్లలో మంత్రిగా కొనసాగినట్లు తెలిపారు. అంతకుముందు కేంద్రంలో ఉన్న బీజేపీ దేశంలో మూడు కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసింది.. కానీ తెలంగాణ మాత్రం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని బీజేపీ నాయకులు కొందరు ఇలా చేశారు... అలా చేశారని తప్పుడుతున్నట్లు చెప్పుకొచ్చారు.








